# చేదు మిఠాయి

## – కొంపెల్ల విశ్వం

"వెంటనే బైల్దేరిరా– మురళి"

ఇంతే వుందా టెలిగ్రాంలో. వెంటనే బైల్దేరాడు తపస్వి. కానీ ఎంత ఆలోచించినా కారణం ఏమయి వుంటుందో అతనికి అర్థం కాలేదు. అర్థంకాని దాని గురించి వదలి పెట్టకుండా ఆలోచించడం అతని వృత్తి ధర్మం. వృత్తిపరంగానే కాదు, వ్యక్తిగా కూడా ఆలోచిస్తున్నాడు తపస్వి. ఎంత ఆలోచించినా ప్రయోజనం కనిపించడంలేదు. సిడ్నీషెల్డన్ కొత్త నవల చేతిలోకి తీసుకుని బెర్త్ మీద వాలి, ఆ పేజీల్లో మనసు పరిగెత్తించడానికి ప్రయత్నిస్తున్నాడు.

* * * *

స్టేషన్‌లో ట్రెయినాగింది. తపస్వి దిగాడు.

"నమస్తే సార్" శ్రీరామమూర్తి, మురళి పి. ఏ ఎదురొచ్చి చేతిలోని హేండ్ బ్యాగ్ తీసుకున్నాడు.

"ఎందుకు, అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం యిచ్చారు? మురళీ ఎక్కడ?"

"పదండి, చెబుతాను"– అన్నాడే కానీ ఏమీ చెప్పలేదు శ్రీరామమూర్తి. స్టేషన్‌లోనూ, కార్లోనూ కూడా. తపస్వి తన ఆలోచన్లలో తనున్నాడు. బిజినెస్ మేగ్నెట్‌గా ఎంత బిజీగా వున్నా తన కోసం స్టేషన్‌కు రాకుండా ఎప్పుడూ లేదు మురళి. పైగా ఎప్పుడూ వసపోసినట్టు వాగే శ్రీరామమూర్తి మాటలు రాని వాడిలా మౌనవ్రతం పాటిస్తున్నాడు. ఆలోచనల్లో కారు ఆగడం గమనించనే లేదు తపస్వి.

"దిగండి సార్"

దిగాడు. దిగిం తర్వాత కానీ గమనించలేదు, ఎక్కడ దిగిందీ.

'ఇదేమిటీ, యింటికి తీసుకెళ్ళకుండా హోటల్‌కి తీసుకొచ్చావ్"– యిది తపస్వి అడుగుదామనుకుని, అడగని ప్రశ్న.

లిఫ్టులో పైకెళ్ళారు. 333 గది వద్ద నిలబడి బజర్ నొక్కాడు శ్రీరామమూర్తి. 'కమిన్' అనే పిలుపు కోసం చూడకుండా లోపలికి నడిచాడు. అనుసరించాడు తపస్వి. వెంటనే బైటకు వెళ్ళిపోయాడు శ్రీరామమూర్తి. మురళీ మొహంకేసి చూసాడు తపస్వి, చాలా దయనీయంగా, ఆందోళనగా, నిస్తేజంగా వుంది.

"ఏమిటి, ఏం జరిగింది, అసలెందుకిలా వున్నావ్?" ప్రశ్న మీద ప్రశ్న కురిపించాడు తపస్వి. అంతే! చిన్న పిల్లాడి కన్నా హీనంగా ఏడుస్తూ తపస్విని పెనవేసుకున్నాడు మురళి. ఆశ్చర్యపోయాడు తపస్వి– ఫేక్టరీలో ఎన్నో వేల వర్కర్లను తన కనుసంజ్ఞలతో నడిపే మురళి కన్నులలో నీళ్ళా!?. అలా ఏడుస్తూనే దిండు కింద నించి ఓ కాగితం తీసి తపస్వికిచ్చాడు. చూసి ఆశ్చర్యపోయాడు– మురళి భార్య వసుంధర విడాకుల కోసం పంపిన లీగల్ నోటీసు అది.

"ఏమిట్రా యిది!?" ఎలాగో అడిగాడు తపస్వి.

"ఏమిటో చెబుతావనేరా నిన్ను రమ్మన్నది"

"అదికాదు– వసు, నువ్వు చాలా అన్యోన్యంగా....."

"అవును.... అందుకే ఈ అన్యాయాన్ని భరించలేకపోతున్నాను. ప్లీజ్. ట్రైటు హెల్ప్‌మి"

"అలా డిజక్టెడ్‌గా ఫీలయితే ఎలారా? ముందు నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకో"

"భార్యను కంట్రోల్ చేయలేని వాణ్ని.... నన్ను నేను ఏం కంట్రోల్ చేసుకోగలనురా?" ఏడుస్తూనే మాట్లాడుతున్నాడు మురళి. అతన్ని అనునయించి రాబట్టిన విషయం అసలు నమ్మశక్యం కాకుండా వుంది–

"ఇంపాసిబుల్. ఫేక్టరీ ఓనరివి, లక్షాధికారివి. నిన్ను వొదిలిపెట్టి అఫ్టరాల్ ఓ టేక్సీ డ్రైవర్ని పెళ్ళిచేసుకోబోతోందా వసుంధర? అసలు నువ్వు వొంటి మీద స్పృహ వుండే మాట్లాడుతున్నావా?"

"నాకు లేదు. నీకుందిగా. ఆవిడగారు నీకూ క్లోజేగా, యింటికెళ్ళి ఆవిడ్నే అడుగు" అన్నాడు మురళి గ్లాసులో విస్కీ వొంపుకుంటూ.

లిఫ్టులో కిందకెళ్ళాడు తపస్వి. శ్రీరామమూర్తి, డ్రైవరు సిద్ధంగా ఉన్నారు. 'ఓసారి యింటికెళదాం' అన్నాడు తపస్వి.

'తెలుసు' అన్నట్టు చూశారు శ్రీరామమూర్తి, డ్రైవరు.

ఎప్పుడూ కోలాహలంగా ఉండే ఆ ఇల్లు ప్రాణం లేని అందమైన మనిషిలా వుంది. మురళి తల్లి ఓసారి తపస్వి కేసి చూసి తలదించుకుంది. మురళి చెల్లెలు పుస్తకం చదువుతూ అసలు అతని రాకనే గమనించనట్టు వూరుకుంది. అదేమీ పట్టించుకోకుండా మేడ మెట్లెక్కి మురళి గదిలోకి వెళ్ళాడు తపస్వి. అద్దం ముందు కూర్చుని అందాన్ని సరిదిద్దుకుంటోంది వసుంధర. తన రాకను తెలియజేస్తూ చిన్నగా దగ్గాడు తపస్వి.

"దగ్గడమెందుకు, లోపలకు రా" అంది వసుంధర అతి మామూలుగా.

"నేను విన్నది నిజమేనా!?" లోపలికి వస్తూ అడిగాడు తపస్వి.

"నువ్విప్పుడు వచ్చింది ఆయన తరఫున కోర్టులో వాదించడానికి కాదా!?"

"అసలేమయింది నీకు?"

"ఆయన చెప్పలేదా!?"

"వసూ నువ్వేనా యిలా ప్రవర్తిస్తున్నది?"

"కొత్తగా ప్రేమ పిచ్చిలో పడిందాన్ని. ఇంకెలా ప్రవర్తిస్తాను చెప్పు" అంటూ తపస్వి బుగ్గ మీద చిన్నగా కొట్టి, "అర్జెంటు పని మీద నేను బైటకెళ్ళాలి. కోర్టులో కలుసుకుందాం. ఓకే' అంటూ తన సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్ళిపోయింది వసుంధర.

* * * *

రుక్మిణి శ్రీకృష్ణుడ్ని కాకుండా ఇంకొకరి మీద మనసు పడినట్టు, సీత రాముణ్ణి కాకుండా మరో మగవాడ్ని చూసి మోజుపడిందంటే నమ్మడం ఎంత కష్టమో వసుంధర మురళిని వదిలి వెళ్ళిపోతుందంటే నమ్మడం అంతన్నా రెట్టింపు కష్టం. వసుంధర మురళికి మాత్రమే. కాదు, మురళి తల్లికి, చెల్లికి కూడా ఆరాధ్య దైవం. అలాంటి వసుంధర మరో మగాడి మీద మోజుపడి..... బుర్ర తిరిగిపోతోంది తపస్వికి. హోటల్ రూముకొచ్చి దిగి, కారును, శ్రీరామమూర్తిని పంపేసి మురళి గదికెళ్ళాడు తపస్వి. మురళి స్పృహపోయేంత వరకు తప్ప తాగి, పడివున్నాడు గదిలో. ఏం చేయాల్లో తోచలేదు. కాగితం, పెన్ను తీసుకుని నాలుగు లైన్లు బరికి, బ్యాగ్ తీసుకుని కిందకొచ్చి, టాక్సీ పిలిచి, స్టేషన్‌కు పోనిమ్మని కూర్చున్నాడు.

* * * *

ఉన్నవాడు వున్నట్టు వూరుకోకుండా టేక్సీ డ్రైవరు ఏదేదో వాగుతున్నాడు. పెద్దగా పట్టించుకోకుండా ఆ( ఊ( లతోనే సరిపెడుతున్నాడు తపస్వి. సడన్‌గా టేక్సీ రోడ్డు వార ఆపేసి "సార్, సార్, సార్" అంటూ స్టీరింగ్ మీద తలపెట్టి ఉండచుట్టుకు పోతున్నాడు డ్రైవరు.

"అరే, ఏమయింది" అంటూ టేక్సీ దిగి, అతన్ని సమీపించాడు తపస్వి కంగారుపడుతూ.

"సార్.... ఈ కుడి వైపు సందులో దేవకీ నర్సింగ్‌హోమ్ వుంది.... నన్ను అక్కడకు తీసుకెళ్ళండి" అతి కష్టం మీద చెప్పాడు డ్రైవరు. అతన్ని పక్కకు జరిపి, అతను చెప్పినట్టే చేసాడు తపస్వి. అతనికి గుండె జబ్బు వుందని, ఆల్రెడీ రెండుసార్లు వచ్చి తగ్గిందనీ తెలిసింది తపస్వికి.

అతనికి కాస్త స్పృహ వచ్చేవరకు అక్కడే వున్నాడు తపస్వి.

"సారీ!" అన్నాడు కళ్ళు తెరిచి. అతని పేరు రాజారామ్.

"పరవాలేదు.... తగ్గి"–

"పోతానన్నారు కదూ! మూడో సారి బాబూ. ఈ గుండె పోటు రావడం. బాబూ! మీరెవరో నాకు తెలీదు. కానీ మనసున్న మారాజని తెలుసు. లేకపోతే టాక్సీ డ్రైవరు కోసం ఇట్లా సాయపడతారా?"

"అది కాదు"–



"నన్ను చెప్పనివ్వండి. నా తాగుడుకు విసిగిపోయి నా భార్య నన్నొదిలి వెళ్ళిపోయింది. తాగుడు మానేశాను. కానీ ఆమె రాలేదు! ఆమె వొదిలిళ్ళిన..... కాదు, ఆమె తీసుకెళదామనే అనుకుంది– తాగిన మైకంలో నేనే ఇవ్వనన్నానంట. ఇప్పుడు అయిదేళ్ళ కొడుకు నాతోనే వున్నాడు. ఆడికి లోకం తెలీదు. అన్నీ మీరే దయ చూడాలి......

మరో సంగతి బాబూ, వసుంధరా ఫేక్టరీ ప్రొప్రయిటరుగారి భార్య వసుంధర....." గుండెల్లో నొప్పి వచ్చి ఆగాడు రాజారామ్.

"ఊఁ... వసుంధర" ఆత్రంగా అడిగాడు తపస్వి.

"చెబుతా.... ఆయమ్మ చాలా మంచిది బాబూ! నా బిడ్డ కోసమని పాతికవేలు ఆంధ్రా బ్యాంకులో డిపాజిట్ చేసింది".

"ఎందుకు!?"

"చెప్తా బాబూ! ఆయమ్మకు పిల్లలు లేరు. పుట్టరు కూడా. పాపం.... ఆయమ్మ కూడా ఎంతో కాలం బ్రతకదంట. బ్లడ్ కేన్సరు.... వాళ్ళ ఆయనకు, అత్తగారికి ఆమంటే ప్రేణం...... వాళ్ళ మనసు విరిచేయాలని నాతో సంబంధమున్నట్టు....." చెప్పలేక, చివరకు సరిగా చెప్పకుండానే ప్రాణం విడుస్తూ తన బిడ్డ జాగ్రత్త మాత్రం చెప్పి చనిపోయాడు రాజారామ్. అతని మరణం దుఃఖకారణమే అయినా ఓ చిక్కుముడి విడినందుకు కొంచెం సంతోషించాడు తపస్వి. కానీ అది కొంచెం సేపే. వసుంధరకి బ్లడ్ కేన్సర్. అది తెలీకుండా ఉండాలనే ద్వేషం పుట్టించుకుంది తన మీద. ఈ సంగతి మురళికి ఎలా చెప్పాలి?

ఈ సంగతులన్నిటి కన్నా ముందు రాజారామ్ కొడుకు సంగతే చూడాలనే కర్తవ్యం తపస్విని తొందరపెట్టింది. ఫార్మాలిటీస్ పూర్తి చేసి రాజారామ్ ఇంటి అడ్రసు పట్టుకుని వెళ్ళాడు తపస్వి. అయిదేళ్ళ కిరణ్ తండ్రి కోసం ఎదురు చూస్తున్నాడు. చుట్టుప్రక్కల వాళ్ళను కలిసి రాజారామ్ మరణం గురించి చెప్పి కుర్రాడ్ని తాను తీసుకెళ్ళబోతున్నానని చెప్పగానే వాళ్ళు సంతోషించారు. ఆ కుర్రాడి బాధ్యత వాళ్ళ మీద పడనందుకు. కుర్రాడ్ని దగ్గరకు తీసుకుని పెట్టె, బట్టలు సర్దుతున్న తపస్వి ఒక్కసారిగా వెయ్యి మెగావాట్ల షాక్ కొట్టినట్టయి అవాక్కయిపోయాడు. ఆ సర్దడంలో అతనొక ఫోటో చూసాడు. ఆ ఫోటోలో రాజారామ్ పక్కన వున్నది ఎవరో కాదు– తపస్వి భార్య రూప. పైగా అది రాజారామ్, రూపల పెళ్ళి ఫోటో. రెండు మూడుసార్లు తన గతం రూప చెప్పబోతే తానే వద్దనడం గుర్తొచ్చిందతనికి. కానీ.... కానీ.... ఇప్పుడిలా.... ఈ కుర్రవాణ్ణి తీసుకెళ్ళాలా వద్దా? బాగా ఆలోచించిన మీదట కిరణ్‌ను రూపతో కలపడమే న్యాయమనిపించింది తపస్వికి. ఇక తన జీవితం? మింగుడు పడని చేదు మిఠాయి. □

